క్లుప్తంగా

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శంకర్

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఔట్ రీచ్ సర్వే పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ శంకర్ హెచ్చరించారు. మండలంలోని బోరంపల్లిలో సోమవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేపట్టిన ఔట్‌రీచ్ సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే పారదర్శకంగా చేయాలని సిబ్బందికి సూచించారు.

3న ఎంపీపీ ఎన్నిక

విడపనకల్లు: విడపనకల్లులో ఎంపీపీ ఎన్నిక ఫిబ్రవరి 3న ప్రత్యేకాధికారి షఫ్రీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఎంపీపీ బోయ నాగలక్ష్మి ఇటీవల రాజీనామా చేయడంతో.. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఫిబ్రవరి 3న ఎంపీపీ ఎన్నిక జరుగుతుందన్నారు. మండలంలో 15 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి, భైరసముద్రం గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటనాయుడు సోమవారం ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూలీల హాజరు శాతాన్ని రోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కూలీల శాతం పెంచాలని టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అప్పాస్వామి నాయుడు, టీఏ పండరీష్, ఎఫ్ఏలు శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ పంట కోత ప్రయోగం

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో సోమవారం వ్యవసాయాధికారులు పప్పుశనగలో పంటకోత ప్రయోగం చేపట్టారు. మొదటి ప్రయోగంలో 2.950 కిలోలు, రెండో ప్రయోగంలో 2.850 కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఓ నవత తెలిపారు. కార్యక్రమంలో రిలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి, వీహెచ్ఏ, వీఏఏ, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గుమ్మఘట్ట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేదిక్ వైద్యురాలు రాధాకుమారి సూచించారు. మండలంలోని బీటీపీ గ్రామంలో ఉన్న కేజీబీవీపాఠశాలలో సోమవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, రుతుస్రావం గురించి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షబానాబేగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

గృహ సారథుల నియామకం

శెట్టూరు: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో గృహ సారథుల నియామకం పూర్తయినట్లు సచివాలయాల కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు తెలిపారు. సోమవారం శెట్టూరు, చింతర్లపల్లి, కనుకూరు, తిప్పనపల్లి, ములకలేడు, పెరుగుపాళ్యం, అయ్యగార్లపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో గృహ సారథుల ను నియమించామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశులు, గంగన్న, నాగరాజు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు నిర్ధారణ పరీక్షలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అజాద్ ఉర్దూ పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు (ప్రత్యేక అవసరాల పిల్లలు) ఉచితంగా పంపిణీ చేసే ఉపకరణాల కోసం మంగళవారం నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. రాయదుర్గం రూరల్, పట్టణంతోపాటు కణేకల్లు, డీ.హీరేహాళ్, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట మండలాల్లో ఉన్న 1-16 ఏళ్ల వయస్సు గల దివ్యాంగ విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు చేపడతారన్నారు. ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి అనంతపురం జిల్లా వైద్య బృందం హాజరవుతారన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు భవిత కేంద్రానికి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను వారి తల్లిదండ్రులు పిలుచుకుని రావాలన్నారు. సదరం సర్టిఫికెట్, దివ్యాంగ విద్యార్థి ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్సులు, రెండు ఫొటోలు, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలన్నారు.

వాహనాల వేలం

కళ్యాణదుర్గం: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను సెబ్ అధికారులు వేలం వేశారు. స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం అనంతపురం సెబ్ కార్యాలయం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస గౌడ్, సెబ్ సీఐ లక్ష్మణ్‌దాస్ పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది ద్విచక్రవాహనాలు, ఒక ఆటో వేలం వేయగా రూ.1,31,000 , జీఎస్టీ రూ.23,580తో కలిపి మొత్తం రూ.1,54,580 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

విడపనకల్లు: మండలంలోని చీకలగురికి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయింది. చీకలగురికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మల్లి సోదరుడు లింగప్ప ద్విచక్రవాహనాన్ని ఇంటి బయట ఉంచాడు. అర్ధరాత్రి ఇంటి బయట ఉన్న ద్విచక్రవాహానికి నిప్పు పెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పాల్తూరు పోలీసులు తెలిపారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగు



కణేకల్లు: సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: షేక్షానుపల్లి గ్రామంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



కళ్యాణదుర్గం రూరల్: మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కణేకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ నిరుపేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కణేకల్లుక్రాస్, కె.కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, స్థానిక నాయకులు కుందా హనుమంతరెడ్డి, రామాంజినేయులు, గోపాల్, ఉదయ్, ప్రతాప్‌తో కలసి విప్ ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కాపు మాట్లాడుతూ సీఎం జగన్ పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీల సిఫార్సుతోపాటు లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడా సమస్యలు లేవన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో పేద, నిరుపేద ప్రజలు సుఖసంతోషాలతో ఉండటం టీడీపీ వారికి ఇష్టం లేదని కాపు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో అధికారం కోసం చంద్రబాబు 600పైగా హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. కాగా కణేకల్లు క్రాస్‌లో నివాసముంటున్న మాల్యం మాజీ సర్పంచు, టీడీపీ నాయకురాలు శోభ సంక్షమ పథకాల ద్వారా దాదాపు రూ.66 వేలు లబ్ధిపొందినా లేదంటూ బుకాయించడాన్ని ప్రజలు తప్పుపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.పద్మావతి, ఎంపీపీ సంధ్య, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్ప చౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, నాయకులు డాక్టర్ సోమన్న, హనుమంతరావు, గోపాల్, రామ్మోహన్‌రెడ్డి, కావలి గోవిందరాజులు, యంత్రకాయల వన్నూరప్ప, భాస్కర్‌రెడ్డి, గౌని శ్రీనివాసరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పథకాలు

ఉరవకొండ: పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని షేక్షానుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యంతం మంజుల హాజరయ్యారు. ఈసందర్భంగా వారు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. గ్రామంలో సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను మాజీ ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగన్న, ఎంపీటీసీ రామలింగ, ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సుంకన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్, సర్పంచ్‌లు పాలడగు వంశీ, సిద్దార్థ్, నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, రమేష్, ప్రభాకర్, అయ్యప్పరెడ్డి, దావీదు, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన జగన్‌తోనే సాధ్యం
'గడప గడప'లో మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో పారదర్శక పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని బోయపల్లి, దాసంపల్లిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై లబ్ధిదారులతో ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ ఎవరి సిఫారసు లేకుండా నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పాలన తీసుకువచ్చిన జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. ఇలాంటి సీఎంను మళ్లీ గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. అణగారిన వర్గాలను అన్ని విధాలా ఆదుకున్నది జగనన్నే అన్నారు. టీడీపీ వారు చెప్పే కల్లబొల్లి మాటలకు ఎవరూ మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గమ్మ, ఎంపీపీ మారుతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, కౌన్సిలర్ అర్చన, ఉప సర్పంచ్ నారాయణస్వామి, రాష్ట్ర జానపద సృజనాత్మకత డైరెక్టర్ బాబురెడ్డి, నాయకులు మల్లన్న, వెంకటేశులు, హనుమంత రాయుడు, నారాయణ రెడ్డి, నరేంద్రరెడ్డి, జయపాల్‌రెడ్డి, శ్రీధర్‌చంద్ర, కృష్ణారెడ్డి, జానకిరామిరెడ్డి, తిమ్మరాజులు, గంగాధర, తిమ్మరాయుడు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



సీఎం జగనన్న మా కుటుంబానికి ఎంతో మేలు చేశారు. ఆయనకు ఎంతో రుణపడి ఉన్నాం. మా కుటుంబానికి వైఎస్సార్ చేయూత, పంటల బీమా, రైతు భరోసా, పింఛన్ కానుక తదితర పథకాల ద్వారా రూ.2.46 లక్షలు లబ్ధి చేకూరింది. ఇంత మేలు చేసిన సీఎంను మళ్లీ గెలిపించుకుంటాం.

–కుళ్లాయమ్మ, బోయలపల్లి, కళ్యాణదుర్గం

వసతి గృహంలో తాగునీటి సమస్య పరిష్కారం



బాలికల వసతి గృహంలో బోరు డ్రిల్లింగ్ మిషన్‌కు పూజలు చేస్తున్న ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి

కళ్యాణదుర్గం: ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బాలికల వసతి గృహాలకు శాశ్వత తాగునీటి పరిష్కారం లభించింది. గత కొన్ని రోజులుగా పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాలు 1, 2కు సమీపంలోని సత్యసాయి తాగునీటి పథకం నుంచి నీటిని వినియోగించుకునేవారు. తాగునీటి వసతి లేదని గుర్తించిన ఆర్డీఓ తన వంతుగా వసతి గృహంలో సోమవారం ఉచితంగా బోరు డ్రిల్లింగ్ వేయించారు. బోరులో నీరు సమృద్ధిగా లభించింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కారమవడంతో ఏఎస్ డబ్ల్యూ నరసింహారావు, కాలేజ్ హాస్టల్ అధికారి నాగరాజు, వార్డెన్లు జయలక్ష్మి, ఓబుళమ్మ ఆర్డీఓకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకరయ్య, ఆర్ఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలు పెండింగ్ ఉండకూడదు

కళ్యాణదుర్గం: ప్రజల నుంచి స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను పెండింగ్‌లో ఉండకూడదని ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. అధికంగా భూ సంబంధిత అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. అనంతరం డివిజన్లో ఆయా మండలాల వారీగా స్పందన అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా అర్జీలను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని ఆర్డీఓ సూచించారు.

యువత గాంధీమార్గంలో నడవాలి



రాయదుర్గం: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



కళ్యాణదుర్గం: గాంధీ విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యులు



ఉరవకొండ: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పాలకవర్గ సభ్యులు

రాయదుర్గం: మహాత్మాగాంధీ ఆశయ సాధనకు యువత కట్టుబడి, మంచి మార్గంలో నడవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని బాలిలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో విప్ కాపు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కార్యదర్శి వాల్మీకి పవన్, పార్టీ నాయకుడు బోయ హనుమంతరాయుడు, హెచ్ఎం రమాదేవి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్‌రావ్‌తో కలసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేపట్టారు. అనంతరం జాతిపిత చిత్రపలానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. విప్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమంటపంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సుబ్రమణ్యం, వెంకటరమేష్, సుదర్శన్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీచౌక్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని బోరంపల్లి సచివాలయంలో గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కుష్టురహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి, కార్యదర్శి అనిల్, ఆరోగ్య కార్యకర్త సరోజ, సిబ్బంది సాగర్, అమృత్, అఫ్రీన్, భారతి, వలంటీర్లు, ఆశా వర్కరు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచి, ఆయన ఆశయ సాధన కోసం పాడుపడుతామని ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, జెడ్పీ మాజీ సభ్యుడు సింగాడి తిప్పయ్య పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద వర్ధంతి సభ నిర్వహించారు. పంచాయతీ ఈఓ గౌస్ సాహెబ్, వార్డు సభ్యుడు నిరంజన్‌గౌడ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో సోమవారం గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి సర్పంచ్ మోనాలిసా, గ్రామ కా దర్శి శ్రీధర్‌రావు, జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గడేహోతురు గ్రామంలో గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు సురేంద్ర, వైద్యాధికారి పద్మ, సూపర్ వైజర్లు నాగేంద్రప్రసాద్, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం(డి హీరేహాళ్): చిరుధాన్యాల సాగు లాభదాయకమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. డి హీరేహాళ్ మండలంలోని సోములాపురంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రక్తహీనత, మధుమేహం లాంటి అనేక దీర్ఘకాల జబ్బులకు చిరు ధాన్యలే ఔషధమన్నారు. మార్కెట్లో వాటి ప్రాముఖ్యత పెరుగుతుండడంతో సాగు విస్తీర్ణం రెట్టింపు చేసి, పూర్వవైభవం తెచ్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నాడన్నారు. చిరు ధాన్యాల సాగు, ఎగుమతుల రంగంలోనూ దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలపాలన్నదే జగన్ లక్ష్యమని గుర్తుచేశారు. రైతు భరోసా కేంద్రాల్లో చిరు ధాన్యాలు, అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు.చిరు ధాన్యల సాగుతో పెట్టుబడులు తగ్గి ఆశించిన స్థాయిలో లాభాలు పొందవచ్చని విప్ కాపు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, సర్పంచ్ సుదర్శన రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, ఏఓ క్రిష్ణకిషోర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తొండె వెంకటేశులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పశు వైద్యశాల నిర్మాణానికి భూమిపూజ రేపు

బెళుగుప్ప: మండల కేంద్రంలో పశు వైద్యశాల భవన నిర్మాణానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, వ్యవసాయ సహకారసంఘ అధ్యక్షుడు శివలింగప్ప, నాయకులు త్రిలోక్‌రెడ్డి, మచ్చన్న సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలు క్రితం పశు వైద్యశాల విద్యుత్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. అప్పటి నుంచి పశువైద్యశాల లేక రైతులు ఇబ్బందిపడేవారు. వారి తొలగించాలనే లక్ష్యంతో మండల కేంద్రంలో పశువైద్యశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. సుమారు రూ.20 లక్షల ప్రభుత్వ నిధులతో పశువైద్యశాలను నిర్మించనున్నారు. ఇందుకు సంబందించి మాజీ ఎమ్మెల్యే బుధవారం ఉదయం 10 గంటలకు భూమిపూజ చేయనున్నారు.

అర్హులందరికీ గృహాల మంజూరు



నూతన ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగనన్న ప్రభుత్వం అర్హులందరికీ ఆవాస గృహాలు మంజూరు చేస్తుందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని దాసంపల్లిలో ప్రధాన మంత్రి ఆవాస యోజన (గ్రామీణ్) పథకం కింద నిర్మించిన లబ్ధిదారు రామాంజనమ్మ ఇంటిని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఇప్పటికే అర్బన్ ప్రాంతాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేసి పేదలకు ఇళ్లు మంజూరు చేసి నివాసయోగ్యం కల్పించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ లేఅవుట్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఎంఏవై(జీ) ఇళ్ల నిర్మాణాలను చేపట్టామని, నియోజకవర్గంలో అహుడా పథకం కింద అర్హులందరికీ పక్కా ఇల్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మారుతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, సర్పంచు దుర్గమ్మ, హౌసింగ్ ఏఈ లోకనాథ్‌చౌదరి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కణేకల్లు: మండలంలోని అంబాపురం గ్రామంలో మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచు పాటిల్ భారతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, పర్వతరెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

జోడు లింగాలకు పూజలు

కూడేరు: మాఘ మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శివపార్వతుల దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

కల్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల, మల్లికార్జునపల్లి జెడ్పీహెచ్ఎస్‌లలో 10వ తరగతి విద్యార్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆంధ్రప్రదేశ్ జోనల్ శాఖ స్టడీమెటీరియల్ పంపిణీ చేసింది. సోమవారంఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దిలీప్‌కుమార్, ఫల్గుణప్రసాద్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జోనల్ కార్యదర్శి కే చిత్తప్ప, నాయకులు ఇలియాజ్, ఎం.నాగరాజు, వన్నూరుస్వామి, రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెళుగుప్ప నుంచి బళ్లారికి బస్సు నడపండి

బెళుగుప్ప: మండల కేంద్రం నుంచి కర్ణాటకలోని బళ్లారి జిల్లా కేంద్రానికి ఒక్క బస్సు సర్వీసు కూడా లేకపోవడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీపీ వీరన్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి వివరించారు. సోమవారం ఉరవకొండ ఆర్టీసీ డిపో పరిశీలన అనంతరం షేక్షానుపల్లిలో మాజీ

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రాయదుర్గం , కళ్యాణదుర్గం డిపో మేనేజర్లకు ఫోన్ చేసి బళ్లారి సర్వీసును పునరుద్ధరించి నిత్యం నడపాలని చైర్మన్ సూచించారని సీపీ వీరన్న తెలిపారు.

మరుగుదొడ్లు నిర్మించండి

శెట్టూరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం మరుగు దొడ్లు నిర్మించాలని తహసీల్దార్ ఫణికుమార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌ను కలిసిన దళిత నాయకులు బస్టాండ్‌లో మరుగు దొడ్లు నిర్మించాలని కోరారు. అలాగే మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని, వాటికి సొంత భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, సభ్యులు మారెన్న, తిమ్మప్ప, బాబు, సురేష్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి



వజ్రకరూరు: గడేహోతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బ్రహ్మసముద్రం: వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ రాజేష్‌కుమార్

బొమ్మనహాళ్/బ్రహ్మసముద్రం/వజ్రకరూరు/కూడేరు/గుమ్మఘట్ట: కుష్టు వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి అవసరమని వైద్యులు సూచించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. అలాగే సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. వైద్యులు మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు కుష్టు కావచ్చని, ప్రాథమిక దశలోనే మందులు వాడటం వల్ల కుష్టువ్యాధి పూర్తిగా నయం చేయవచ్చన్నారు. నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. బొమ్మనహాళ్ మండలంలని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీల పరిధిలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. వైద్యాధికారిణి గీతాభార్గవి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యాధికారి రాజేష్‌కుమార్, సీహెచ్ బాలాజీ, సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు. వజ్రకరూరు మండలంలోని గడేహోతూరు, చిన్న హోతూరు గ్రామాల్లో కుష్టువ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు సురేంద్ర, బాల్యం సుంకులమ్మ, గడేహోతురు వైద్యాధికారి పద్మ, హెల్త్ సూపర్‌వైజర్లు నాగేంద్రప్రసాద్, సరోజమ్మ, గ్రామ కార్యదర్శి క్రిష్టారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. కూడేరులోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో సామాజిక ఆరోగ్య అధికారి మోహన్‌బాబు, సీహెచ్ఓ వరలక్ష్మి, సర్పంచ్ లలితమ్మ, హెచ్ఎం శ్రీనివాసప్రసాద్, సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎం , ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు రమేష్, రాజేష్‌నాయక్, సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు రవికుమార్, బయ్యమ్మ,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.